# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

## ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి

### *వాడే..నేను..!*



12 డిసెంబర్ 1971 న ఆంధ్రపత్రిక దినపత్రికలో ఒక వార్త వచ్చింది. 'ప్రఖ్యాత కవి, నాటకకర్త, సినీ రచయిత పింగళి నాగేంద్రరావు మృతి' అని.

వార్త టైటిల్ కీ, వివరాలకీ మధ్య పింగళిగారి ఫోటో బదులుగా విజయా ప్రొడక్షన్స్ సినీ నిర్మాణ సంస్థ భాగస్వామి, రచయిత చక్రపాణి గారి ఫోటో అచ్చయింది..

విశాఖపట్నంలో ఈ వార్త చదివిన ప్రముఖ రచయిత భమిడిపాటి రామగోపాలం గారు, మరో రచయిత ఎమ్వీఎల్ (ముత్యాలముగ్గు సినీ నిర్మాత కూడా) గారు కలిసి అర్జంటుగా పోస్టాఫీసుకి వెళ్ళి ఆంధ్ర పత్రిక ఆఫీసులోని శంభుప్రసాద్ గారికి ట్రంకాల్ చేసారు.



'నేను ఎమ్వీఎల్ నండీ నా పక్కని భమిడిపాటి రామగోపాలం ఉన్నాడు. ఇవాళ మన డెయిలీలోనండీ, పింగళి నాగేంద్రరావు గారి ఐటెమ్ లో చక్రపాణి గారిఫోటో ప్రింటయిపోయిందండీ'

'అయ్యో అలాగా..నేను చక్రపాణి గారికి క్షమాపణలు చెప్పి రేపటి పేపర్లో సవరణ వేయిస్తాను' అన్నారు పత్రికాధిపతి శంభుప్రసాద్ గారు.

ఆ తరువాత ఎమ్వీఎల్ గారు చక్రపాణి గారికి కూడా ఫోన్ చేసారు.

ఆయన చెప్పిన పొరబాటు ఫోటో గురించి విని

"ఆళ్ళు సరిగానే యేశారులే.. ఎందుకంటే ఆడుబోతే నేపోయినట్టేగా..' అన్నారు..!

అదీ పింగళి, చక్రపాణి గారి మధ్య అనుబంధం, అనురాగం..!

(భరాగో గారి ఆత్మకథ 'ఆరామ గోపాలం' నుంచి..)

***

### *మొదటిసినిమా-అట్టర్‌ఫ్లాప్*



ప్రముఖ రచయిత పింగళి నాగేంద్రరావుగారి మొదటి సినిమా 'వింధ్యరాణి' 1948లో విడుదలయ్యింది. అందులో హీరో అప్పటికే 60వ పడిలో పడుతున్న డి.వి.సుబ్బారావు, హీరోయిన్ ప్రముఖ హిందీ నటి రేఖ తల్లి పుష్పవల్లి. ఆ సినిమా ఘోర పరాజయం పాలై వారంరోజులు కూడా ఆడలేదు. ఐతే రచయితగా పింగళిగారికీ, హాస్యనటుడిగా రేలంగికి కూడా 'వింధ్యరాణి' మంచి పేరు

తెచ్చి పెట్టింది.

***

## తెలుగులో నవరంగ్



1960 ప్రాంతాల్లో హిందీలో చారిత్రాత్మక ఘన విజయం సాధించిన 'నవరంగ్' సినీ దర్శకుడు శాంతారామ్ ఆ సినిమాని తెలుగులో నిర్మించడానికి ప్రయత్నాలు చేసారు. ప్రముఖ సినీ గేయ రచయిత కొసరాజు గారిని పాటలు, మాటలు వ్రాయడానికి నియమించి కొంత కాలం పాటు స్క్రిప్టు పని కూడా చేసారు. ఐతే తెలుగు చిత్రానికి పూర్తి న్యాయం చేకూర్చలేనేమోననే సందేహంతో ఆ ప్రోజెక్టుని మధ్యలో ఆపేసారు శాంతారామ్. ఆ సినిమాకి మక్కీకి మక్కీ కాపీ కాకపోయినా ఆ సినిమా స్ఫూర్తితోనే బీరమ్ మస్తాన్ రావు గారు 1989 ప్రాంతాల్లో 'సువర్ణ సుందరి' అనే సినిమాని చంద్రమోహన్, జయశ్రీ(మళయాళీ నటి)లతో నిర్మించారు (ముందులో ఈ సినిమాకి అక్కినేని, హేమమాలిని అని కూడా అనుకున్నారు.). ఈ సినిమా ఘోరపరాజయం మస్తాన్ రావు గారి సినీరంగ నిష్క్రమణకి కూడా దారితీసింది..!

***

## జానపదబ్రహ్మ సాంఘిక సినిమా



జానపదబ్రహ్మగా పేరు తెచ్చుకుని 50 సంవత్సరాల క్రిందటే అద్భుతమైన ట్రిక్స్‌తో అనేక విజయవంతమైన జానపద చిత్రాలు నిర్మించిన విఠలాచార్య సినీ జీవితం సాంఘిక చిత్రాలతోనే మొదలైంది. 1955 లో మొదటిసారి 'కన్యాదానం' అనే సాంఘిక చిత్రాన్ని తీసారు. ఇందులో హీరో, హీరోయిన్లు కాంతారావు, షావుకారు జానకి.  తరువాత 5 సంవత్సరాలపాటు సాంఘిక చిత్రాలే నిర్మించి దేనిలోనూ విజయం సాధించలేక పోయారు. అప్పుడు 1960లో 'కనకదుర్గపూజా మహిమ' తో జానపద చిత్ర దర్శకత్వాన్ని మొదలుపెట్టి ఘన విజయం సాధించి, తెలుగు చలన చిత్ర రంగంలో అత్యధిక జాపద చిత్రాల నిర్మాతగా, దర్శకుడిగా మిగిలిపోయారు.

***

## నిర్మాత కుమారుడూ , దర్శకుడి కుమారుడూ...



చిరంజీవి తొలిసారి సోలో హీరోగా నటించిన చిత్రం,'కోతలరాయుడు. దీని నిర్మాత ఒక ప్రముఖ నిర్మాతగారి అబ్బాయి, దర్శకుడు మరో ప్రముఖ దర్శకుడిగారి అబ్బాయి. వాళ్ళే తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారి అబ్బాయి భరద్వాజ(తర్వాత ఈయన దర్శకుడయ్యారు), కె.ప్రత్యగాత్మ గారి అబ్బాయి కె.వాసు. హీరోగాశతదినోత్సవం జరుపుకున్న చిరంజీవి మొదటిసినిమా కూడా ఇదే.!

***

## స్వయంకృషి

ప్రముఖ కుటుంబ చిత్రాల దర్శకుడు కృష్ణారెడ్డి మొదటిసారి సినీ రంగప్రవేశం యంగ్ హీరోగా



'పగడాలపడవ' అనే సినిమాతో జరిగింది. దానిలో మెయిన్ హీరో హరనాథ్. ఆ సినిమా విడుదలకి నోచుకోలేదు. ఆ తరువాత మిత్రుడి అచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి కలిసి హైదరాబాదులో స్వీట్స్ బిజినెస్ పెట్టారు. ఇరానీ హోటళ్ళకి ఆంధ్రా స్వీట్స్ సరఫరా చేసే వ్యాపారం. అందులో విజయం సాధించాక టీ పొడి వ్యాపారం కూడా చేసారు. అప్పట్లో డంకన్ టీ చాలా ఫేమస్. ఐతే వీళ్ళ టీ పొడిని 'పాప్ టీ' (పాప్ సాంగ్స్ నుంచీ ప్రేరణ) పేరుతో విడుదలచేసి విజయం సాదించారు.. సినీ రంగప్రవేశానికి ముందు కృష్ణారెడ్డి. అచ్చిరెడ్డి గార్ల స్వయంకృషికీ, వ్యాపారప్రయోగాలకీ ఇవి నిదర్శనాలు.

***

## బంగారురాజు..!



ప్రముఖ క్రియేటివ్ దర్శకుడు కృష్ణ వంశీ అసలు పేరు 'వెంకట బంగారురాజు'. ఆయన సినీ జీవితం లైట్ బోయ్‌గా మొదలైంది. ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'మనీ-మనీ'. కానీ ఆ సినిమాకి దర్శకుడుగా శివనాగేశ్వరరావు పేరు వచ్చింది. ఆ తరువాత 'అనగనగా ఒక రోజు' సినిమాకి కూడా దర్శకుడిగా మొదలుపెట్టారు. కానీ మధ్యలో ఆయనని దర్శకత్వ స్థాయి నుంచీ అసిస్టెంట్ గా తగ్గించి ఆయన బదులు రామ్ గోపాలవర్మే ఆ సినిమాని పూర్తి చేసారు.

***

## మొదటి సినిమాలు..

| | |
|---|---|
| కొంగర జగ్గయ్య | ఆదర్శం (1952) లో కథానాయకుడిగా. |
| టి.ఎల్.కాంతారావు | నిర్దోషి (1951) లో చిన్న పాత్ర, 'ప్రతిజ్ఞ'(1953) లో కథానాయకుడిగా. |
| బాలయ్య | ఎత్తుకి పైఎత్తు (1958) లో కథానాయకుడిగా. |
| సత్యనారాయణ | 'సిపాయి కూతురు' (1959) లో కథానాయకుడిగా. |
| హరనాథ్ | 'మాఇంటి మహాలక్ష్మి'(1959) లో కథానాయకుడిగా. |
| గుమ్మడి | 'అదృష్టదీపుడు'(1950) |
| నాగభూషణం | 'పల్లెటూరు'(1952) లో చిన్న పాత్ర, ఏది నిజం'(1956) లో కథానాయకుడు. |
| రాజనాల | 'ప్రతిజ్ఞ' (1953) |
| ప్రభాకర రెడ్డి | 'చివరకు మిగిలేది'(1960) లో. |
| హాస్యనటుడు రమణారెడ్డి | 'మానవతి' (1952)లో. |
| రావి కొండలరావు | 'శోభ' (1958) లో. |

# ఆత్రేయ గీతాల్లో నీతి సుధలు – పదాల పొందికలు

తొలికోడి కూతల్లే వినిపించి
తొలిపొద్దు వెలుగల్లే కనిపించి
తొలిజన్మ ఋణమేదో అనిపించి
తెలవని తలుపులు తెరిపించి
వచ్చింది ఎందుకో తెలిసుంటే వెళ్ళవు
వెళ్ళేది తెలిసుంటే అసలొచ్చి వుండవు
తెలియక వచ్చింది తెగిపోని బంధం
తెలిసీ నువు చేసింది తీయని గాయం

*మనసు-మాంగల్యం(1971)*

వాడిపోయిన నిన్నలన్నో మరచిపోయి
చిగురులేసే ఒక్క రేపును తలచి మురిసి
రేపు నేడై, నేడు నిన్నై
రూపుమాసి పోవు వరకూ
ఎదురు తెన్నులు చూచుకుంటూ
ఎరుపు కన్నులు సోలిపోతూ
ఎవరికోసం? ఎంతకాలం?
ఈ జాజి తీగ రోజు రోజూ
పూలు పూచే దెవరికోసం

*విచిత్ర దాంపత్యం(1971)*

అరిటాకమ్మా ఆడజన్మమూ
ముళ్ళకంచె ఈ మూఢ సంఘమూ
ముళ్ళకెన్నడూ దండనలేదు
చిరిగిన ఆకు విస్తరి కాదు..

*స్త్రీ జన్మ (1967)*

మధువు కన్న కైపు మమతలోన వున్నది
మన బతుకులన్ని దాని చుట్టె తిరుగుతున్నవి
అందరం పంచుకున్న నెత్తురొక్కటే
ఆఖరికి కలుసుకునే చోటు ఒక్కటే

*మనసు-మాంగల్యం(1971)*

మాట తప్పిపోయినా
మనిషి బ్రతికితే చాలు - మన
మమత చంపుకున్నా - ఒక
మంచి మిగిలితే చాలు

*దసరాబుల్లోడు (1971)*

చీకటిలో వెలుగును చూడనేర్చుకో
చెమటలో స్వర్గాన్ని సృష్టి చేసుకో
విధి వ్రాసిన వ్రాతలకు విరుగుడొక్కటే
పదిమంది తోటి పంచుకునే రోజు వచ్చుటే
ఆ రోజు వచ్చుటే..!

*భార్యా బిడ్డలు (1971)*

బొజ్జలోని పాపాయి
పొరలి పొరలి తన్నినా
పొంగిపోవు కడుపుతీపి అమ్మది
కుసిలి కుసిలి పాలకై
గుండెమీద గుద్దినా
మురిసిపోవు వెన్న మనసు అమ్మది

*కలిసిన మనసులు(1968)*

కర్మను నమ్మిన వాళ్ళెవరూ కలిమిని స్థిరమనుకోరు
కళ్ళుమూసుకోరు
మనసు తెలిసిన వాళ్ళెవరూ మమత చంపుకోరు
మనిషినొదులుకోరు
ఉన్నదాని విలువెరుగనివాళ్ళు పోగొట్టుకుని విలపిస్తారు

*తాసిల్దారుగారమ్మాయి(1971)*

అలవాటు లేదని మడికట్టుకోకు
అందాన్ని కాదని చెడగొట్టుకోకు
తొలిసారి వదిలేస్తే పొరబాటు - అదే
పదిసార్లు రుచిచూస్తే అలవాటు

*నా తమ్ముడు (1971)*

మరికొన్ని వచ్చే సంచికల్లో